
సాక్షి ఒడిశా

శనివారం ౹ 30 ౹ మార్చి ౹ 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,32,980లు,బంగారం 600 మిల్లీగ్రాములు, వెండి 49గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రభుత్వ ఉద్యోగి హత్య

పర్లాకిమిడిలోని గురండి పోలీసుస్టేషన్ పరిధి బట్టి సిరి పురం గ్రామంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి మెడ నరికి తోట గుమ్మడ పొలాల్లో పడివేసి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు.

- IIలో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
శని	ఆది
6.06	4.27

న్యూస్‌రీల్

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు



సిద్ధమైన బ్యాలెట్ బాక్సులు

బరంపురం: స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఉదయం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి అనిల్ కుమార్ పండా తెలియజేశారు. గంజాం బార్ న్యాయవాదుల సంఘం 2023–24 ఎన్నికల్లో అధ్యక్ష పదవికి 4, ఉపాధ్యక్ష పదవికి 2, కార్యదర్శి పదవి కోసం 6 మంది, సహాయ కార్యదర్శి పదవి కోసందిద్దరు అభ్యర్థులు తలపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సంఘం సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. సాయంత్రం 5 గంటల నుంచి అభ్యర్థుల ఓట్ల లెక్కింపు, అనంతరం విజేతల వివరాలు ప్రకటించడం జరుగుతుందని వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక హనుమాన్ బజార్ మెయిన్ రోడ్డులోని మానస్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. గంజాం హోటల్స్ సంఘం అధ్యక్షుడు ఉమాకంత్ పాణిగ్రాహి శిబిరాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రాజెక్ట్ చైర్మన్ పి.ధర్మారావు, క్లబ్ ప్రతినిధులు పీకే పండా, లక్ష్మీనారాయణ, రజనీ పాత్రో, స్వాయ్యక్ సాహు, సరస్వతీ పాత్రో, రజనీ మహాపాత్రో, ఉషారాణి పాఢి, సభి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా జట్నీలోని బాణాసంచా తయారీ యూనిట్‌లో పోలీసులు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఖుర్దా జిల్లా జట్నీ పోలీస్‌స్టేషన్‌కు చెందిన బృందం శుక్రవారం బాణాసంచా ఉత్పత్తి యూనిట్‌పై దాడి చేసింది. ఈ దాడిలో సుమారు 40 కిలోల పేలుడు పదార్థాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలకు సంబంధించి ఎటువంటి చెల్లుబాటు అయ్యే పత్రాన్ని అందించనందున పోలీసులు యూనిట్ యజమాని ఉమాకాంత్ శత్పతిని అరెస్టు చేశారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు సంఘ వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించడంలో భాగంగా పోలీసులు దాడులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పిప్పిలి, డెలాంగ్, ఖుర్దా, బ్రహ్మగిరి తదితర ప్రాంతాలకు ఇక్కడ తయారైన క్రూడ్ బాంబులు సరఫరా చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం నిజమని తేలింది.

రోడ్డు ప్రమాదంలో యువ ఇంజినీరు మృతి



ప్రమాద స్థలంలో మహంతి మృతదేహం

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా జట్నీ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువ ఇంజినీరు దుర్మరణం పాలయ్యాడు. మృతుడు జట్నీ మున్సిపాలిటీ కుదియారి గ్రామానికి చెందిన మిలన్ మహంతి (45)గా గుర్తించారు. ఖుర్దా టౌను ప్రాంతంలో డ్యూటీ ముగించుకుని గురువారం అర్ధరాత్రి పూట తిరిగి వస్తుండగా జట్నీ మండల కార్యాలయం వద్ద దుర్ఘటనకు గురయ్యాడు. ఈ ప్రాంతంలో వేగ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఆ సమయానికి వెనుక నుంచి వస్తున్న భారీ వాహనం ఆయన పైనుంచి వెళ్లడంతో ఘటన స్థలంలో ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక ఎయిమ్స్ ఆస్పత్రిలో పంచనామా నిర్వహించి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన వాహనంతో డ్రైవర్‌ని జట్నీ ఠాణా పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



సంబల్‌పూర్ కింగ్ ఎవరో..!

- జీజేడీ, బీజేపీ నుంచి హేమాహేమీల పోటీ
- 3 జిల్లాల ఓటర్లపై ప్రభావం
- గెలుపుపై ఇరువురి ధీమా

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని పరిస్థితులు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రధాన పక్షాలు హేమాహేమీలను బరిలోకి దింపాయి. ప్రధానంగా బీజేపీ, బీజేడీ కూటమి బెడిసి కొట్టడంతో పోటీ మరింత పదును ఎక్కింది. బీజేడీతో పొత్తు లేకుండా ఒంటరి పోరుకి దిగడంతో అటు కేంద్ర నాయకత్వానికి, ఇటు రాష్ట్రంలో ప్రతిష్టపై బీజేపీ రాష్ట్ర శాఖ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. మరోవైపు కాంగ్రెసు అంతః కలహాల తీవ్రతని తగ్గించుకుని మాజీ నాయకులను అక్కున చేర్చుకుని అసమ్మతికి తావు లేకుండా క్రమంగా పూర్వ వైభవం కూడగట్టుకునేందుకు శతవిధాల కృషి చేస్తుంది.

7 అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం

సంబల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం అంగుల్, సంబలపూర్, దేవ్‌గడ్ 3 జిల్లాల పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. వీటిలో సంబల్‌పూర్, దేవ్‌గడ్, రెంగాలి (ఎస్సీ), కుచిండా (ఎస్టీ), రెడాఖోల్, ఛెండీపాదా (ఎస్సీ), అఠొమల్లిక్ శాసనసభ నియోజక వర్గాలు ఉన్నాయి. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ధర్మేంద్ర ప్రధాన్ అంగుల్ జిల్లా వాసి. ఆయన జిల్లాకు చెందిన 2 అసెంబ్లీ సెగ్మెంట్లు ఛెండీపాదా, అఠొమల్లిక్ సంబలపూర్ పార్లమెంటరీ నియోజక వర్గంలో పరిధిలో ఉన్నాయి. మరో 3 అసెంబ్లీ సెగ్మెంట్లు సంబల్‌పూర్, దేవ్‌గడ్ మరియు రెంగాలి ప్రస్తుతం బీజేపీ అధీనంలో ఉన్నాయి. అఠొమల్లిక్, కుచిండా, రెడాఖోల్, ఛెండీపాదా 4 అసెంబ్లీ సెగ్మెంట్లలో బిజూ జనతా దళ్ ఆధిపత్యం నెలకొని ఉంది. ఇదిలా ఉండగా సంబలపూర్ లోక్‌సభ స్థానం భారతీయ జనతా పార్టీ అధీనంలో ఉంది. ఈ పరిస్థితుల్లో సంబలపూర్ లోక్ సభ స్థానం చేజిక్కించుకోవడం ఉభయ పక్షాల అభ్యర్థులక కత్తి మీద సాములా ఉంటుంది. సంబలపూర్ జిల్లా ఎన్నికల పర్యవేక్షకుడిగా బీజేడీ అభ్యర్థి ప్రణబ్ ప్రకాష్ దాస్ బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సమగ్ర జిల్లాపై ఆయన గట్టిపట్టు సాధించారు. లోతైన సమీక్షతో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఏడింట 4 స్థానాల్లో బలం చెక్కు చెదరకుండా బలాన్ని చేజిక్కించుకుని వ్యూహాత్మకంగా సంబలపూర్ లోక్‌సభ నియోజకవర్గం కైవసం చేసుకోగలడనే ధీమాతో బిజూ జనతా దళ్ నిరీక్షిస్తుంది. సమగ్రంగా బీజేపీ అభ్యర్థి ధర్మేంద్ర ప్రధాన్‌పై ప్రణబ్ ప్రకాష్ దాస్ గెలిపొందితే రాజకీయ యోధుడుగా మరో మైలు రాయిని ఆవిష్కరిస్తాడు. వీరివురు సై అంటే సై అంటూ సత్తా చాటుకోవడంలో సంబలపూర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో తలపడుతున్నారు.

సంబల్‌పూర్‌లో సై అంటే సై

పశ్చిమ ఒడిశాలో సంబల్‌పూర్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేడీ, బీజేపీ మధ్య పోరు హోరాహోరీగా ఉంటుంది. బీజేపీ నుంచి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేడీ నుంచి ఆ పార్టీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఈ ఇద్దరు స్థానికేతరులుగా ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుండడం కీలకమైన అంశం. వీరిరువురి పోటీ ప్రతిష్టాత్మకం అవుతుంది. కేంద్ర నాయకత్వం దృష్టిలో ధర్మేంద్ర ప్రధాన్ సంక్లిష్ట పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించే దక్షత కలిగిన నాయకుడుగా చలామణి అవుతున్నారు. పలు రాష్ట్రాల్లో ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించి ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. ఇప్పుడు సొంత రాష్ట్రంలో ప్రత్యక్షంగా పోరుకు తలపడ్డారు. ఆయనకు ధీటైన ప్రత్యర్థిగా బీజేడీ ప్రణబ్ ప్రకాష్ దాస్‌ని పోటీకి నిలబెట్టింది. దీర్ఘకాలంగా రాష్ట్ర పాలన పగ్గాలు చేపట్టిన బిజూ జనతా దళ్ వ్యూహ రచనకు ఆయన తెర వెనక కథానాయకుడుగా పేరొందారు. వివాదరహితంగా చిక్కు సమస్యలు తీవ్రరూపం దాల్చకుండా సమయ స్ఫూర్తితో సర్దుబాటు చేయగలిగే సమర్థవంతుడుగా ఉన్నత గుర్తింపు సాధించారు. ఆయన మేధసుని సద్వినియోగపరచుకునేందుకు ఎమ్మెల్యే పోటీ నుంచి పార్లమెంటుకి నిలబెట్టడంతో బాటు నియోజకవర్గం కూడా మార్చి బీజేడీ అధిష్టానం గట్టి సవాలుని విసిరింది. ఈ ఇరువురు నేతలపట్ల అపారమైన నమ్మకంతో బీజేపీ, బీజేడీ తొడగొడుతున్నాయి.

సీఎం నవీన్ పట్నాయక్‌తో భేటీ



కొరాపుట్: సీఎం నవీన్ పట్నాయక్‌తో కొరాపుట్, నబరంగ్‌పూర్ అభ్యర్థులు



బరంపురం: సీఎం నవీన్‌తో గంజాం జిల్లా అభ్యర్థులు

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం బీజేడీ తమ అభ్యర్థుల జాబితాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గంజాం జిల్లా అభ్యర్థులు భువనేశ్వర్‌లోని సీఎం నవీన్ నివాస్‌లో ఆయనను శుక్రవారం కలిశారు. మాజీ మంత్రి విక్రమ్ కేసరి ఆరక్, విక్రమ్ పండా, పూర్ణ స్వాయి, లితికా ప్రధాన్, సుభాష్ బెహర, చిన్మయనంద దేవ్, శ్రీకాంత్ సాహులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ పార్లమెంటరీ స్థానాల పరిధిలోని కొరాపుట్, నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాల బీజేడీ అభ్యర్థులు సీఎం నవీన్ పట్నాయక్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ మేరకు తమకు టిక్కెట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసినవారిలో నబరంగ్‌పూర్ లోక్‌సభ అభ్యర్థి ప్రదీప్ మజ్జి, కొరాపుట్ లోక్‌సభ అభ్యర్థి కౌసల్య హిక్కా, ఎమ్మెల్యే అభ్యర్థులు చంద్ర శేఖర్ మజ్జి, కౌసల్య ప్రధాని, నవీనా గోండో, మానస్ మడ్కామి, రమేష్ చంద్ర మజ్జి, రఘురాం పొడాల్, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, ఉమ్మర్‌కోట్ మాజీ ఎమ్మెల్యే సుభాష్ గొండొ, కొరాపుట్ మాజీ ఎంపీ జిన్ను హిక్కాలు ఉన్నారు. అనంతరం వీరంతా పూరీ జగన్నాథుని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే ప్రతాప్ జెనాకు ఊరట

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన మహంగా జంట హత్యల కేసులో బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే, మాజీ న్యాయ శాఖ మంత్రి ప్రతాప్ కుమార్ జెనాకు ఒరిస్సా హైకోర్టు మధ్యంతర రక్షణను ఏప్రిల్ 10 వరకు మరోసారి పొడిగించింది. గతేడాది సెప్టెంబర్ 24న జేఎంఎఫ్‌సీ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం, ఫిర్యాదుదారు, సాక్షులు, ఇతర అందుబాటులో ఉన్న ఆధారాల వాంగ్మూలాలను పరిశీలించిన తర్వాత, నిందితుడు ప్రతాప్ జెనాపై భారతీయ శిక్షా స్మృతి (ఐపీసీ) సెక్షన్లు 302, 506, 120 బి కింద నేరాలకు ప్రాథమికంగా శిక్షార్హమైన కేసుగా గుర్తించబడింది. దీంతో గతేడాది అక్టోబర్ 31న అధికార పరిధి ఆధారంగా ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయన పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం నిందిత ప్రతాప్ కుమార్ జెనాకు మొదట గతేడాది డిసెంబర్ 19 వరకు మధ్యంతర రక్షణ కల్పించింది. తదుపరి దశల్లో జరిగిన విచారణ పురస్కరించుకుని రక్షణ గడువుని న్యాయస్థానం అంచెలంచెలుగా పొడిగిస్తూ వస్తోంది.

అనసూయా మాఝికి సహకరించం



మాట్లాడుతున్న జగదీష్ పాత్రో, పక్కనే నెక్కంటి, మాజీ మంత్రి లాల్ బిహారి తదితరులు

- బీజేడీ అసంతృప్త వర్గం స్పష్టీకరణ
- కార్యకర్తల అభిప్రాయ సేకరణలో నెక్కంటి



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న కార్యకర్తలు

రాయగడ: అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ తరుపున టిక్కెట్టు పొందిన అనసూయా మాఝికి ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించమని ఆ పార్టీలోని అసంతృప్త వర్గం ముక్త కంఠంతో తీర్మానించింది. అనసూయా మాఝికి టిక్కెట్టు ఖరారైన అనంతరం చెలరేగిన అసంతృప్తి సెగలు మరింత ఉధృతమవుతున్న తరుణంలో పార్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో స్థానిక రాణిగుడ ఫారంలోని ఆయన స్వగృహంలో అభిప్రాయ సేకరణ శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాసీపూర్ ప్రాంత సీనియర్ నాయకుడు జగదీష్ చంద్ర సాహు మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం వరకు రాయగడ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేదన్నారు. అటువంటి కంచుకోటను బీజేడీ కైవసం చేసుకునేలా చేసిన నాయకుడు నెక్కంటి భాస్కరరావు మాత్రమేనని అన్నారు. అంతటి నాయకుడి సేవలను విస్మరించిన అధిష్టానం, గుర్తింపు లేని అనసూయా మాఝికి రాయగడ టిక్కెట్టు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

మరోసారి ఆలోచించాలి

రాయగడ అసెంబ్లీ స్థానం టిక్కెట్టు కేటాయింపు విషయంపై అధిష్టానం మరోసారి ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని కాసీపూర్ సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి కోరారు. ప్రజల కోసం నిరంతరం సేవలందించే నెక్కంటి వంటి నాయకుడి మాట కాదని, నేడు అధిష్టానం తీసుకున్న నిర్ణయం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఒకవేళ అధిష్టానం ఈ విషయమై పునరాలోచన చేయకపోతే, తామంతా ఈసారి జరిగే ఎన్నికల్లో అనసూయా మాఝికి ఎటువంటి సహకారం అందించే ప్రసక్తే లేదన్నారు.

ఆదివాసీ తెగకు చెందిన వ్యక్తి కాదు

రాయగడ శాసనసభ ఎస్టీ వర్గానికి కేటాయించిన సంగతి అందరికీ తెలిసిందేనని జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పవ్వల అన్నారు. ఆదివాసీ భాష, సంస్కృతి అంటే ఏమీ తెలియని అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయించడం ఆదివాసీలను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ భాషలో కనీసం మాట్లాడలేని ఆమె ఈ ప్రాంత ఆదివాసీల సమస్యలను ఎలా తెలుసుకోగలదని ప్రశ్నించారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గెలవడంతో ప్రజలు ఐదేళ్లు వనవాసం చవిచూశారని మరో సీనియర్ నాయకుడు వినాయక్ కర్ అన్నారు. ఈసారి అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయిస్తే ప్రజలకు మరో ఐదేళ్లు ఇబ్బందులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలు మెచ్చిన వ్యక్తికి కేటాయించాలి

ఎన్నికల్లో పార్టీ విజయపథంలో నడవాలంటే నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండే వ్యక్తికి పార్టీ టిక్కెట్టు కేటాయించాలని రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్ అన్నారు. అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయించే విషయంలో కార్యకర్తలు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు ఇప్పటికే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాలు చేస్తుండడం అధిష్టానం గమనించాలని కోరారు.

అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా


రాయగడ నియోజకవర్గానికి సంబంధించి అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయించే విషయమై కార్యకర్తలు, నాయకులు, సీనియర్ నాయకుల అభిప్రాయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని నెక్కంటి పేర్కొన్నారు. అంతవరకు ఎవ్వరూ ఎటువంటి వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. అధిష్టానం తీసుకునే నిర్ణయం ప్రకారం కార్యకర్తలు పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ జరుపుతున్న పోలీసులు

జయపురం: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని పట్టణంలో గురువారం రాత్రి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి నేతృత్వంలో పట్టణ పోలీసులు, సదర్ పోలీసులు, మహిళా పోలీసులు, బీఎస్ఎఫ్ జవాన్లు, ఓఎస్ఎఫ్, జిల్లా పోలీసు యంత్రాంగం ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. పట్టణ ప్రధాన మార్గాల్లోనే కాకుండా రాజనగర్, పంచానన మందిర కూడలి, జయనగర్, చిలిగుడ, లక్ష్మీ పండ కూడలి, క్రిస్టియన్‌పేట, ఇరిగేషన్ కాలనీ, సత్య అధికారి కూడలి, పారాబెడ, గోపబంధునగర్, ఒడియా మేదరి వీధి, డెప్పుగుడ, నెహ్రూ నగర్, బెల్ రోడ్డు, ఎంజీ రోడ్డు, ప్రథమ దైనిక బజారు మీదుగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు ఎటువంటి భయం లేకుండా ఓటు వేయాలని అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో బీఎస్ఎఫ్ జవాన్లు

'కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం'



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బరంపురం: ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పలు పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా రాష్ట్రంలో అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శారద ప్రసాద్ సత్పతి ఆరోపించారు. స్థానిక జ్యోతి రెసిడెన్స్‌లో గంజాం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మిశ్రణ పర్వ్ సమావేశం శుక్రవారం జరిగింది. దీనిలో భాగంగా దాదాపు 100 మందికి పైగా బీజేడీ, కాంగ్రెస్ కార్యకర్తలు బీజేడీలో చేరారు. ఈ సందర్భంగా శారద ప్రసాద్ మాట్లాడుతూ బీజేడీ హయాంలో గంజాం జిల్లాలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని మండిపడ్డారు.

ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇప్పటివరకు చెల్లించకపోవడంతో అయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు. కార్యక్రమంలో ప్రదీప్ పాణిగ్రాహి, కన్నుచరణ్ పతి, జిల్లా బీజేపీ యువ మోర్చా సునీల్ సాహు, ప్రభత్ సడంగి, శివశంకర్ దాస్, కె.అనిల్ కుమార్, సుభాష్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాలు సీజ్



అరెస్టైన నిందితులు



సీజ్ చేసిన వాహనాలు

బరంపురం: అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అస్కా టౌన్ ఎస్‌డీపీవో జయంత్ కుమార్ మహాపాత్రో తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం అస్కా పోలీసుస్టేషన్ పరిధి బొడా నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు దాడులు చేసి 4 ఇసుక ట్రక్కులు, ఒక కంకర ట్రాక్టర్ సీజ్‌చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో హింజిలికాట్‌కి చెందిన కన్హాదాస్, కొటినాడ గ్రామానికి చెందిన కన్హా గౌడ, బుగడా బ్లాక్‌కి చెందిన రాజీవ్ ప్రధాన్‌లు ఉన్నట్లు నిర్ధారించారు.

ప్రేమికురాలిని అపహరించేందుకు యత్నం



అరెస్టైన కులధర నాయిక్, పింటు హంతాల్‌లు



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీ

జయపురం: ప్రేమికురాలిని అపహరించేందుకు యత్నించిన యువకుడు, అతడి సహచరుడు గ్రామస్తులకు పట్టుబడిన ఘటన జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి బలియపాదర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వారిద్దరినీ ఆ గ్రామస్తులు బొయిపరిగుడ పోలీసులకు అప్పజెప్పారు. వీరిని విచారిస్తున్నట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. పట్టుబడినవారు బెజింగవాడ గ్రామానికి చెందిన కులధర నాయిక్, అతడి స్నేహితుడు పింటు హంతాల్‌లుగా వెల్లడించారు. వారి వద్దనున్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

వివరాలను పరిశీలిస్తే...

బొయిపరిగుడ సమితి బలియపాదర్ గ్రామానికి చెందిన లుకునాథ్ పంగికి రెండేళ్ల క్రితం బెంజింగవాడ గ్రామానికి చెందిన లిలా పంగి అనే యువతితో వివాహం జరిగింది. అయితే అప్పటికే బెంజింగవాడ గ్రామానికి చెందిన కులధర నాయిక్ లీలా పంగిని ప్రేమించాడు. దీంతో అతడు తన మిత్రుడు పింటు హంతాల్‌తో కలిసి బలియపాదర్ గ్రామానికి వచ్చి లీలా పంగిని అపహరించేందుకు ప్రయత్నించాడు. వారిని అడ్డుకున్న లుకనాథ్ పంగిని తన భార్యను పంపమని డిమాండ్ చేశారు. అయితే తన భార్యను పంపేందుకు లుకనాథ్ నిరాకరించగా వారితో తీసుకొచ్చిన తుపాకీతో భయపెట్టారు. దీంతో లుకనాథ్ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కులధర నాయిక్‌తో పాటు అతడి మిత్రుడిని పట్టుకొని బంధించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితులను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

చిన్న పిల్లల వైద్యంపై ప్రాథమిక అవగాహన ఉండాలి



టెక్కలిలో ఈఎంటీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా మేనేజర్

టెక్కలి: 108 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బందికి అత్యవసర సమయాల్లో చిన్న పిల్లల వైద్యంపై ప్రాథమికంగా అవగాహన ఉండాలని ఏఈఎంఎస్ జిల్లా మేనేజర్ హరిప్రసాద్ సూచించారు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో డివిజన్ స్థాయిలో ఈఎంటీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యవసర సమయాల్లో వివిధ వైద్య సేవలపై ప్రాథమికంగా అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల వైద్య సేవలపై వివరించారు. కార్యక్రమంలో రంగప్రసాద్, ఎస్.కృష్ణారావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెటింగ్‌పై మహిళలకు అవగాహన



ఆహార పదార్థాల తయారీ మిషన్ గురించి వివరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేసి మార్కెటింగ్ చేయడంపై మహిళలకు శుక్రవారం విశాఖపట్నంలోని ఎస్‌వీడీఎస్ స్వచ్ఛంద సంస్థ (విశాఖపట్నం) వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డు) ప్రాంతీయ కార్యాలయం అమరావతి ఆర్థిక సహకారంతో యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లావేరు మండలం తాళ్లవలస గ్రామంలో చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు విజ్ఞాన యాత్ర నిమిత్తం విశాఖ జిల్లా, పాడేరు మండలం, సంతబాయలలో ఎస్‌వీడీఎస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న సుశాగ్ మిల్లెట్స్ (ఎఫ్‌పీఓ)ను సందర్శించారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారుచేస్తూ, మార్కెటింగ్‌లో వారి అనుభవాలను తెలుసుకొనేందుకు సుశాగ్ మిల్లెట్స్ ఎఫ్‌పీఓను సందర్శించినట్లు యూత్ క్లబ్ ప్రతినిధి ఎల్.దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో 30 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు, సుశాగ్ మిల్లెట్స్ ఎఫ్‌పీఓ ముఖ్య కార్యనిర్వహణాధికారి టి.శాంతకుమారి, చైర్మన్ ఎం.విజయ, ఎస్‌డీవీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జోగినాయుడు, యూత్‌క్లబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి ఘన సన్మానం



వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిని శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్‌లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు కలిసి సత్కరించారు. సుబ్బారెడ్డిని సాదరంగా ఆహ్వానించి దుశ్శాలువ, గజమాలతో సత్కరించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. జిల్లాలో ఎనిమిది స్థానాలకు ఎనిమిది స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి వైఎస్ జగన్‌ను బహుమతిగా అందజేయాలన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

సారవకోట: మండలంలోని మూగుపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చౌదరి లక్ష్మీనారాయణ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అప్పారావు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి ఉన్నతాధికారుల సూచన మేరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎల్‌సీ గేట్ సమీపంలో రైలు ఢీకొట్టడంతో గుర్తుతెలియని మహిళ మృతి చెందారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్‌సీ గేట్ సమీపంలో గల చిదంబరేశ్వర దేవాలయం వద్ద అప్‌లైన్ ట్రాక్ వద్ద శుక్రవారం ఓ మహిళ మృతదేహం కనిపించింది. ఆమె వయసు 50 ఏళ్లు ఉంటుందని, తెల్లని ఛాయ కలిగి ఎరుపు, పచ్చని రంగు డిజైన్ గల చీరను, నీలం రంగు జాకెట్ ధరించి ఉన్నారు. మృతురాలు ట్రాక్ దాటే క్రమంలో రైలు ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో జీఆర్‌పీలు సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆదర్శనీయుడు లక్ష్మణ్ నాయక్



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కమలోచన్ మిశ్ర



జయపురం: మత్తిలి కాల్పుల ఘటనను నాటిక రూపంలో ప్రదర్శిస్తున్న చిన్నారి కళాకారులు

నేటి యువతకు దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు సాహిద్ లక్ష్మణ్ నాయక్ ఆదర్శనీయుడని వక్తలు పేర్కొన్నారు. సాహిద్ లక్ష్మణ్ నాయక్ వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: సాహిద్ లక్ష్మణ్ నాయక్‌ను ఉరి తీసిన బరంపురం సర్కిల్ జైలు



కొరాపుట్: దమంజోడిలో లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులు



రాయగడ: లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహాజన్



జయపురం: లక్ష్మణ్ నాయిక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ ప్రదీప్ కుమార్ పరిడ తదితరులు



జయపురం: మాట్లాడుతున్న మదన్ మోహన్ నాయిక్



జయపురం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ మహంతి

• భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే




ప్రార్థనలు చేస్తున్న మహిళలు



బాప్టిస్టు చర్చిలో క్రీస్తు గురించి వివరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద నున్న ఉత్కళ బాప్టిస్టు చర్చిలో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అలాగే ఒడియా బాప్టిస్టు చర్చి, గుమ్మా బ్లాక్‌లో ప్రార్థనలు చేపట్టారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



భువనేశ్వర్: రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. శుక్రవారం 5 చోట్ల పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోవడంతో ఈ సీజనులో తొలి రికార్డుగా నిలిచింది. భారత వాతావరణ శాఖ ప్రాంతీయ కేంద్రం (ఐఎండీ) జారీ చేసి ప్రకారం టిట్లాగఢ్, బొలంగీర్, భవానీపట్న, బౌధ్, నయాగఢ్ ప్రాంతాల్లో పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 40 డిగ్రీలకు చేరడం ఇదే తొలిసారి. మరో నాలుగు ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 39 డిగ్రీల సెల్సియస్ పైబడింది. తాల్చేర్‌లో 39.8 డిగ్రీల సెల్సియస్, ఫుల్బాణి ప్రాంతంలో 39.2, అంగుల్, ఝార్సుగుడ ప్రాంతాల్లో 39.1, నవరంగ్‌పూర్‌లో 39 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జంట నగరాలైన భువనేశ్వర్, కటక్ ప్రాంతాల్లో వరుసగా 37.4, 37.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 4, 5 రోజుల్లో రాష్ట్రంలో వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు ఉండే అవకాశం ఉందని ఐఎండీ ముందస్తు సమాచారం జారీ చేసింది. రాష్ట్రంలోని చాలా చోట్ల వచ్చే 4, 5 రోజుల్లో రాత్రి పూట ఉష్ణోగ్రత కూడా 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగుతుందని ఈ కేంద్రం సమాచారం.

ప్రభుత్వ ఉద్యోగి హత్య



పొలాల్లో పడివున్న లింగరాజు మృతదేహం

పర్లాకిమిడి: గురండి పోలీసుస్టేషన్ పరిధి బట్టి సిరిపురం గ్రామంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి మెడ నరికి తోటగుమ్మడ పొలాల్లో పడివేసి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఐఐసీ రబీంద్ర పాత్రో తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 28న బట్టి సిరిపురం గ్రామంలో బంధువుల ఇంట్లో పెళ్లికి మృతుడు ఎం.లింగరాజు (28) హాజరయ్యాడు. ఆరోజు రాత్రి 10 గంటల వరకు పెళ్లిలో కనబడ్డాడు. తర్వాత ఆయన ఆచూకీ కుటుంబ సభ్యులకు తెలియరాలేదు. తెల్లవారితే బట్టిసిరిపురం–తోటగుమ్మడ మార్గంలో పొలాల్లో లింగరాజు మెడపై కత్తిగాటుతో శవమై కనబడ్డాడు. సమాచారం అందుకున్న బంధువులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పర్లాకిమిడి సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్ కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పర్లాకిమిడి ఇరిగేషన్ శాఖలో పని చేస్తున్నట్లు తెలుస్తోంది. మృతదేహానికి పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు.

నన్ను ఆశీర్వదించండి

• నెక్కంటితో అనసూయా భేటీ



నెక్కంటితో మాట్లాడుతున్న అనసూయా మాఝి

రాయగడ: రాయగడ నియోజకవర్గం నుంచి బీజేడీ టిక్కెట్టు దక్కించుకున్న ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయా మాఝి శుక్రవారం సాయంత్రం బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావుతో భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆశీర్వదించాలని కోరారు. టిక్కెట్టు ఖరారైన తర్వాత ఆమె సీఎం నవీన్ పట్నాయక్‌తో పాటు 5టీ అధ్యక్షుడు వీకే పాండ్యన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పూరిలో శ్రీజగన్నాథుని దర్శనం చేసుకుని రాయగడకు తిరిగి వచ్చిన వెంటనే నెక్కంటి స్వగృహానికి వెళ్లి కలిశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తనకు టిక్కెట్టు లభించడంతో నెక్కంటి ఆశీర్వాదం తీసుకునేందుకు వచ్చానని తెలిపారు. పార్టీలో అసంతృప్తులు సహజమని, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని తెలియజేశారు. నెక్కంటి మాట్లాడుతూ.. అనసూయా మాఝి తన ఆశీర్వాదం తీసుకునేందుకు మాత్రమే వచ్చారని తెలిపారు. అసంతృప్తి వర్గం విషయమై తమ మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



హేమావతి (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: ధర్మపురం చెరువు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కుపల్లి గ్రామానికి చెందిన మడ్డు హేమావతి(34) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు అదే గ్రామానికి చెందిన ఆర్జల నాగమణితో కలిసి స్కూటీపై కాశీబుగ్గ నుంచి స్వగ్రామానికి బయల్దేరారు. ధర్మపురం చెరువు వద్ద అదే గ్రామానికి చెందిన యువకులు అజయ్, హృదయ్‌లు గరుడబద్ర నుంచి కాశీబుగ్గ వైపు బైక్‌పై వస్తుండగా చెరువు వద్ద రెండు బైక్‌లు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు గాయాలపాలయ్యారు. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మడ్డు హేమావతి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతిరాలి భర్త నవీన్ వలస కూలీగా దుబాయ్‌లో ఉన్నారు. ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా ఈ సంఘటనపై స్థానిక ఎస్‌ఐ సీహెచ్ రామారావు కేసు నమోదు చేశారు.

96 ఒడిశా మద్యం బాటిళ్ల పట్టివేత

మెళియాపుట్టి: మండలంలోని సిరియాఖండి జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం పాతపట్నం ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆటోలో 48 బీర్ బాటిళ్లు, 48 ఎంసి (180ఎంఎల్ మెక్‌డొవెల్) బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డారు. మెళియాపుట్టి మండలం పాగడవెల్లి గ్రామానికి చెందిన వీరు ఓ వివాహం కోసం వీటిని తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, ఆటో, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



బుక్క జనార్దన్ (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకలవలస మాజీ సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, లక్ష్మీనర్సుపేట పీఏసీఎస్ డైరెక్టర్ బుక్క జనార్దన (68) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. మండలంలోని కుశమలపాడు గ్రామానికి చెందిన జనార్దన గురువారం తన సమీప బంధువుల ఇంటిలో జరిగిన శుభ కార్యానికి వెళ్లారు. తిరిగి తన స్వగ్రామానికి వచ్చే క్రమంలో తురకపేట సెంటర్ వద్ద తురకపేట రోడ్డు నుంచి ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందకు పడిపోయారు. దీంతో ఆయన తలకు బలమైన గాయమైంది. వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. జనార్దన మృతికి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు రెడ్డి శ్రావణ్, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు కొల్ల కృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

పెళ్లి కబురు చెప్పడానికి వెళ్తూ..

• బైక్ ప్రమాదంలో వలంటీర్ మృతి
• 20 రోజుల్లో పెళ్లి ఉందనగా దుర్ఘటన



కణుతూరు షణ్ముఖరావు (ఫైల్)

పాతపట్నం: మండలంలోని చిన్నమల్లిపురం పంచాయతీ కొయ్యకొండ గ్రామానికి చెందిన వలంటీర్ కణుతూరు షణ్ముఖరావు(37) శుక్రవారం ఓ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఏప్రిల్ 20న షణ్ముఖరావుకు పెళ్లి జరగాల్సి ఉంది. ఆ పెళ్లి కబుర్లు చెప్పడానికి వెళ్తూ ఆయన కన్నుమూశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. షణ్ముఖరావు తన పెళ్లి కబుర్లు చెప్పడానికి శుక్రవారం రాజాం మండలం అమరాం గ్రామానికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేసి పాలకొండ మీదుగా ఇంటికి బైక్‌పై బయల్దేరాడు. రేగిడి మండలం కుమ్మరి అగ్రహారం వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఆటోను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గ్రామస్తులకు సమాచారం అందడంతో ఇక్కడ విషాద ఛాయలు అలముకున్నాయి. షణ్ముఖరావు తండ్రి చిన్నప్పుడే మృతి చెందడంతో తల్లి రాజులమ్మ పెంచి పెద్దచేసింది. మరో 20 రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉందనగా ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

• వైభవంగా శ్రీనివాసుని చక్రతీర్థ స్నానం



స్థానిక హరిదాసు కోనేరులో శుక్రవారం శ్రీనివాసుని చక్రతీర్థ స్నానాలు కన్నులపండువగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి విగ్రహాలకు ముందుగా తిరువీధి నిర్వహించారు. అనంతరం హరిదాసు కోనేరు వద్ద ఆలయ ప్రధానార్చకులు చామర్తి కృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకార్చనలు, చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకవిటికి చెందిన ప్రముఖ ప్రవచన కర్త యాలాల శ్రీనివాసరావు అనుగ్రహ భాషణం చేశారు. కొత్తూరు

ఆలోచింపచేసిన నాటికలు



మూల్యం నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో రెండో రోజు బాపూజీ కళామందిర్‌లో ప్రదర్శించిన రెండు నాటికలను ప్రేక్షకులను ఆలోచింపచేశాయి. గోవాడా క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 'మూల్యం' నాటిక చక్కగా ప్రదర్శించారు. నేటి సమాజంలో స్త్రీకి గల వివక్షతకు వ్యతిరేకంగా ఒక వివాహిత తన హక్కును నిరూపించుకుని సాధించిన కథాంశంతో చక్కగా సాగింది. ఈ నాటికకు కథను సింహప్రసాద్ అందించగా దర్శకత్వం డాక్టర్ వెంకట్ గోవాడ అందించారు. కాకినాడ, తిరుపతికి చెందిన శ్రీశృంగార వల్లభ ఆర్ట్స్ వారి 'కబ్జా' నాటికలో బలహీనుడు దోపిడీకి గురవుతున్నాడని దానితో పాటు న్యాయం, చట్టం, ధర్మ, మానవీయకోణాలు సైతం కబ్జాకు గురవుతున్నాయని తెలిపే ఇతి వృత్తంతో ఈ నాటిక ప్రదర్శన సాగింది. దీనికి దర్శకత్వం కోరుకొండ బ్రహ్మానందం వహించగా, రచన కొంతం కాశీవిశ్వనాథం చేశారు. శనివారం ఇంద్రప్రస్థం, పక్కింటి మొగుడు నాటికల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఆదిత్యాలయ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళ నగదును ఈఓ చంద్రశేఖర్‌కు అందజేస్తున్న శ్రీనుబాబు కుటుంబం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన గొంటు శ్రీనుబాబు (ఎల్ఐసి), రేణుకాదేవి దంపతులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళ నగదును ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. అనంతరం ఆదిత్యుడిని అంతరాలయ దర్శనం చేసుకుని దాతలు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ తదితరులున్నారు.

బండి కాదది.. నా నేస్తమండీ



నా గూడు పోయిందంటూ.. చూపిస్తోన్న వృద్ధుడు



గాయాలతో ఉన్న వృద్ధుడిని లేపుతున్న ట్రాఫిక్ సీఐ అవతారం, కానిస్టేబుల్ రామారావు



రిక్షాను తీసుకెళ్తున్న దృశ్యం

స్థలం శ్రీకాకుళంలోని పాత వంతెన. సమయం శుక్రవారం ఉదయం పది గంటలు. గాయాలతో దీనస్థితిలో ఉన్న కంటా రామారావు అనే రిక్షావాడు. కొందరు పోలీసులు. ఓ పాడైపోయిన రిక్షా. పోలీసులు పాడైపోయిన రిక్షాను తీసుకెళ్తుంటే ఆయన సొంత బిడ్డను తీసుకెళ్తున్నంతగా బాధపడ్డారు. నా రిక్షా జాగ్రత్త.. నా రిక్షా జాగ్రత్త.. అంటూ పోలీసులను వేడుకున్నారు. కరోనా కాలం నుంచి ఆ రిక్షానే రామారావుకు అన్నీ. పొద్దంతా కష్టపడేది. రాత్రయ్యాక పడుకునేది. తెల్లార్లూ కబుర్లు చెప్పుకునేది ఆ బండితోనే. నాలుగు రోజుల కిందట జరిగిన ప్రమాదంలో రిక్షా నుజ్జునుజ్జయిపోయింది. ఆయనకూ గాయాలయ్యాయి. తనకైన గాయాలకు ఎంత బాధ పడ్డాడో గానీ రిక్షా పాడైపోవడంతో కుమిలిపోయారు. రోడ్డు ప్రమాదం జరిగాక పోలీసులే ఆయనను గుర్తించి చేరదీసి శుక్రవారం ఓ చోటకు చేర్చారు. కుటుంబ సభ్యులపై కోపంతో కోవిడ్ సమయానికి ముందు రామారావు ఇల్లు వదిలేసి వచ్చేశారు. మొదట్లో ఓ అద్దె ఇంటిలో ఉండడం, ఆనక అద్దె కట్టలేక రోడ్డున పడడం, దాతల దయపై ఆధారపడి బతుకుతూ వంతెన నీడన రిక్షాలో సేద తీరడం ఆయనకు అలవాటైపోయింది. కష్టానికి అలవాటు పడిపోయారు గానీ పంతం వదిలి కుటుంబానికి దగ్గర కాలేకపోయారు. ఇప్పటికీ ఆయన కుటుంబం వాంబే కాలనీలో నివసిస్తోంది. కుమార్తె కలెక్టరేట్‌లో పనిచేస్తోంది. కానీ మూడేళ్లుగా రిక్షాలోనే నివాసం ఉంటూ.. ఆ బండితోనే నేస్తరికం కట్టిన రామారావు తన బండిని బాగు చేసి ఇస్తే అందులోనే ఉంటానని పోలీసులకు చెప్పడం గమనార్హం. భార్య, కూతురు పిలిచినా వెళ్లిపోతానని కూడా అన్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

క్లుప్తంగా

బాసంగిలో ఏనుగుల గుంపు



ముంపుడు ప్రాంతంలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని ముంపు గ్రామమైన బాసంగి పరిసర ప్రాంతాలలో ఏనుగులు దర్శనమిచ్చాయి. శుక్రవారం మధ్యాహ్నం నాగావళి నది పక్కన ముంపుడులో ఏనుగులు తాండవించాయి. సాయంత్రం సమయంలో అరటి, పామాయిల్ తోటల్లోకి వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. వెంకటరాజపురం, బాసంగి, గవరమ్మపేట పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో పది రోజుల నుంచి ఉంటూ పంటలను నాశనం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటిని తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



సహస్ర దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

31న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 31న రాజాం రచయితల వేదిక 110వ సమావేశం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకుడు గార రంగనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాపు శాంతారావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'వేమన ప్రగతి శీలత' అనే అంశంపై బొంతు సూర్యనారాయణ ప్రసంగించనున్నారని, కార్యక్రమానికి రచయితలు, కవులు, భాషాభిమానులు హాజరుకావాలని కోరారు.

11 మద్యం సీసాల పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్సై సూర్యకుమారి

భోగాపురం: మండలంలోని లింగావలస గ్రామంలో పాన్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సమాచారం మేరకు దాడి చేసి షాపు యజమాని కనకల ఆదిలక్ష్మిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా ఆ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందని చెప్పారు. ఈ సమాచారంతో ఎస్సై సూర్యకుమారి సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం దాడి చేసి షాపులో ఉన్న రూ.4వేల విలువ చేసే 11 మద్యం బాటిల్స్, ఆరు బీరు సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చింతపండుకు టెండర్ ఆహ్వానం

- జీసీసీ డీఎం మహేంద్రకుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం జీసీసీ 2020–21 సంవత్సరంలో కొనుగోలు చేసిన చింతపండు కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న 12000 క్వింటాళ్లకు టెండర్ పిలుస్తున్నట్లు జీసీసీ డీఎం మహేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో గల పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం సరుకులతో పాటు పాడేరు, చింతపల్లి, అరకు, ముంచింగిపుట్టు, జి.మాడుగుల, కాశీపట్నం రకాలు కూడా టెండర్‌లో పెట్టామని పేర్కొన్నారు. టెండర్‌ను ఈనెల 30 తేదీన ఉదయం 10 గంటల నుంచి విశాఖపట్నంలోని జీసీసీ హెడ్ ఆఫీసులో వేయవచ్చని తెలిపారు. ఈ ఏడాది పంట దిగుబడి లేని కారణంగా కొనుగోళ్లు జరగలేదన్నారు. పంట దిగుబడి లేని కారణంగా గిరిజనులు సేకరించిన పంటకు ఎంఎస్‌పీ కంటే అధికంగా ఎక్కడ వచ్చినా వారికి అమ్ముకునే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. ఈనెల 30న విశాఖపట్నం ఎం.డి జి.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో టెండర్లు ఓపెన్ చేస్తామని వివరించారు.

మాజీ మంత్రి ముం'దారి చూపు'

- వందకుటుంబాల నివాసాలపై కన్ను
- అధికారం వస్తే చెరువుగట్టు ఖాళీ చేయించేందుకు పన్నాగం
- గెస్ట్‌హౌస్‌కు రహదారి వేసేందుకు కుట్ర



మాజీ అమాత్యుడు దృష్టిపెట్టిన చెరువుగట్టు ప్రాంతం

రాజాం: ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా వెలగబెట్టిన ఆయన ఆడిందే ఆట..పాడిందే పాటగా చెలామణి అయ్యారు. పదవిని అడ్డు పెట్టుకుని లేని రహదారికి కొత్త ప్లాన్ తయారు చేసి ఏకంగా 60 అడుగుల రహదారి అంటూ ఆశచూపి ఏళ్ల తరబడి నివాసముంటున్న నిరుపేదలను ఖాళీ చేయించే ప్రయత్నం చేశారు. ఏ వంద గ్రామాలో..వందలాది కిలోమీటర్ల దూరాన్నో తగ్గించేందుకో చేసిన ప్రయత్నం కాదిది. రాజాం పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తన గెస్ట్‌హౌస్‌కు రోడ్డు వేసుకునేందుకు వేసిన పథకం. తన గెస్ట్‌హౌస్ పక్కన కారుచౌకగా తాను కొట్టేసేందుకు ప్రయత్నించిన పంటపొలాలకు ధర పుట్టించే దురాలోచన. అవి అప్పట్లో కుదర్లేదు. రాష్ట్ర విభజన, అనంతరం కాంగ్రెస్ పార్టీ కనుమరుగవడంతో ఏమీ చేయలేక చేతులెత్తేసిన ఆ మాజీ అమాత్యుడు ఇప్పుడు అదును కోసం చూస్తున్నాడు. టీడీపీ తీర్థం పుచ్చుకుని అధికారం కోసం అర్రులు చాస్తున్నాడు. ప్రజల కర్మ కాలి పొరపాటున అధికారం దక్కితే చెరువుగట్టుపై ఉన్న వందలాది కుటుంబాలు నిర్వాసితులకావడం ఖాయం. ఇది ఇప్పుడు రాజాం పట్టణమంతా హాట్ టాపిక్‌గా మారింది.

అంత ప్రేమ ఎందుకో?

రాజాం నుంచి శ్యాంపురం వెళ్లే రోడ్డులో రాజాం పట్టణాన్ని ఆనుకుని రంగప్ప చెరువు ఉంది. ఈ రోడ్డులో జీఎంఆర్ సువిధ కాంప్లెక్స్‌తో పాటు గట్టుపై వందకుపైగా మేదర కుటుంబాలు జీవిస్తున్నాయి. మాజీ అమాత్యుడి చూపు ఇప్పుడు ఈ నివాసాలపై పడింది. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ఈ నివాసాల మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణానికి రాజాం నుంచి లావేరు వరకూ రూ.48 కోట్ల నిధులు ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా మంజూరు చేయించారు. అప్పట్లో ఈ చెరువుగట్టు నివాసాల కారణంగా ఇరుగ్గా ఉండగా, వారిని బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేశారు. వాస్తవంగా ఇక్కడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు వేసే అవకాశం ఉంది. లేదంటే కొఠారిపురం మీదుగా బొద్దాం నుంచి రింగ్ రోడ్డు ఇవ్వవచ్చు. అలా కాకుండా అమాత్యుడు రాజాం పట్టణానికి దగ్గర్లో శ్యాంపురం వద్ద తన నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ పక్కన డీ–పట్టా భూమిని నొక్కేసేందుకు ఒక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిని పావులా వాడుకున్నారు. ఈ నేపథ్యంలో తన నివాసంతో పాటు తాను దక్కించుకునేందుకు అవకాశం ఉన్న భూమికి ధర పలికించేందుకు చెరువుగట్టుమీదుగా రోడ్డు ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి విశాఖపట్నం చేరుకునేందుకు దగ్గర మార్గం అవుతుందని రాజాం చుట్టు పక్కల ప్రాంతాల వారిని నమ్మించారు. వాస్తవానికి తన లబ్ధికోసమే ఇదంతా చేస్తున్నాడనే విషయం ఇంతవరకూ ప్రజలు గమనించలేదు. ఇటీవల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడం, టీడీపీ నుంచి టికెట్ గ్యారంటీ కావడంతో మాజీ అమాత్యుడి స్పీడు పెరిగింది. అధికారంలోకి వచ్చిన వెంటనే చెరువుగట్టుపై నిర్వాసితులను ఎలా ఖాళీచేయించాలా? అనే పనిలో పడ్డారు. ఈ విషయం ఇప్పుడు బయటకుపొక్కడంతో నిర్వాసితులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. పొరపాటున ఆ మాజీ మంత్రికి ఓటు వేసి గెలిపిస్తే తమతో పాటు తమలాగా రోడ్డు పక్కన ఉన్న నిర్వాసితుల స్థలాలు ఆక్రమిస్తాడనే ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒక్క రాజాంలోనే కాకుండా తన స్వప్రయోజనాల నిమిత్తం పట్టణ కేంద్రంలో ప్రధాన రహదారిపై కూడా ఆయన కన్ను ఉందని గుసగుసలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.

అన్ని రోడ్లు ఉండగా..ఇక్కడే ఎందుకు?

వాస్తవంగా అప్పట్లో రాజాం నుంచి వంగర, రాజాం నుంచి సంతకవిటి, రాజాం నుంచి రేగిడి, పొందూరు–సంతకవిటి ప్రాంతాల మధ్య రహదారుల నిర్మాణం చేయాల్సి ఉంది. ఒక్కో మండలం వైపు రూ.10కోట్ల నుంచి 15 కోట్లు కేటాయిస్తే చాలు ఈ రోడ్లన్నీ బాగుపడేవి. అలా కాకుండా ప్రజలకు ఏ మాత్రం వినియోగం లేని లావేరు వైపు వెళ్లే దారికి ప్రతిపాదనలు పెట్టి, రూ. 48 కోట్లు మంజూరుచేయించి, కాంట్రాక్టర్ వద్ద 30 శాతం మేర పీసీలను ఆ మాజీ అమాత్యుడు నొక్కేశారు. దీంతో ఆ రోడ్డును నష్టానికి చేయలేక చాలా ప్రాంతాల్లో వంతెనలు, కల్వర్టులు నిర్మించలేక కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు.

సైకిల్ మరి తొక్కలేం బాబూ..!



కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలు



మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు



సాలూరు: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పార్టీ నాయకులు

- వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార వైఎస్సార్‌సీపీలో చేరికలు భారీగా జరుగుతున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ప్రతిపక్షాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధి పాలన పట్ల ఆకర్షితులై ఫ్యాన్ కింద సేద దీరేందుకు వైఎస్సార్‌సీపీలోకి తరలివస్తున్నారు. ఈ మేరకు విజయనగరంలోని 6వ డివిజన్ సీఆర్ కాలనీ, ఆనంద నగర్ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామికి అపూర్వ ఆదరణ లభించింది. అడుగడుగునా జనం నీరాజనం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతించారు. తెలుగుదేశం, జనసేన పార్టీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆరవ డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత, ప్రజాసేవకు స్ఫూర్తిదాత అయిన కోలగట్ల వీరభద్ర స్వామి గెలుపు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. నిత్యం నియోజకవర్గం పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆయన చేసిన కృషి మరువరానిదని, మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రజావసరాలను తీర్చిన మంచి మనసున్న నాయకుడు కోలగట్ల అని కొనియాడారు. తమ డివిజన్‌లో కోట్ల రూపాయలు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో సంతృప్తి చెందిన ప్రతిపక్షాల వారు స్వచ్ఛందంగా వచ్చి కోలగట్ల వీరభద్ర స్వామికి మద్దతుగా నిలుస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, రెడ్డి గురుమూర్తి, ఐదో డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేఏపీ రాజు, ఆల్తి శ్రీనివాసరావు, చిన్నికృష్ణ, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టం: సంత-నర్సిపురంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే కళావతి



రేగిడి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

వీరఘట్టంలో..

వీరఘట్టం: మండలంలోని సంత–నర్సిపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే కళావతి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ సర్పంచ్ కర్రి సత్యవతి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు ఆధ్వర్యంలో వారంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంకిలిలో 70 కుటుంబాలు

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీకి అనుబంధంగా ఉన్న చిన్నయ్యపేట గ్రామంలో సుమారు 70 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గ్రామానికి చెందిన సవిరిగాన శ్రీను, సవిరిగాన వేణు, కొమరాపు ఆదినారాయణ, మరో 67 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, వైస్ఎంపీపీ అచ్చెన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

గచ్చలవలసలో 30 కుటుంబాలు

చీపురుపల్లి: రాష్ట్రంలో ఉన్న పేద పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం, వారి ఎదుగుదల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ఆలోచన చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గచ్చలవలస గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన పిసిని సింహాచలం, పతివాడ అక్కప్పడు, పిసిని శ్రీరాములు, పిసిని సత్యనారాయణ ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

విద్యావ్యవస్థ బలోపేతం

ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పెదనడిపల్లి గ్రామంలో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పేదపిల్లలు భవిష్యత్తులో ప్రపంచంతో పోటీపడే విధంగా రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు ప్రతి నెల 1వ తేదీన ఇంటికి వచ్చి పింఛన్లు అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. రైతులు ఉన్న గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు పొందడమే కాకుండా వారు పండించిన పంటలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొత్స సందీప్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం వలిరెడ్డి శ్రీనివాసులునాయుడు, మీసాల వరహాల నాయుడు , బెల్లాన త్రినాథరావు, దన్నాన జనార్దన్, బెల్లాన వంశీకృష్ణ, పిసిని శ్రీను, పిసిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో 40 కుటుంబాలు

సాలూరు: పట్టణంలోని మెంటాడవీధికి చెందిన సుమారు 40 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర సమక్షంలో ఆయన స్వగృహంలో, స్థానిక కౌన్సిలర్ పప్పల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రొౌతు చిన్నయ్య, రసూల్‌కుమార్ తదితరుల ఆధ్వర్యంలో మెంటాడ వీధికి చెందిన సూపర్‌మార్కెట్ మాజీ డైరెక్టర్ మజ్జి అప్పారావు, పంటల లక్ష్మణరావు, మెంటాడ షణ్ముఖరావు, రామారావు, ఇనుమూరు రాము తదితర 40 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, పార్టీ నాయకులు జర్జాపు సూరిబా బు, గిరిరఘు తదితరులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మెంటాడ శ్రీను, చిన్నారావు,తాడ్డి యశోదకృష్ణ, రొౌతు అప్పారావు, మండల మోహన్ పాల్గొన్నారు.

పెళ్లి పీటలెక్కాల్సిన యువకుడి మృతి

- ఆటో, బైక్ ఢీకొనడంతో ప్రమాదం
- మరో ఇద్దరు మిత్రులకు గాయాలు



షణ్ముఖరావు మృతదేహం




చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రేగిడి: మరో ఇరవై రోజుల్లో పెళ్లి పీటలెక్కాల్సిన ఎక్కాల్సిన యువకుడితో విధి వికటాటహాసం చేసి పాడె ఎక్కించింది. స్నేహితులతో కలిసి పెళ్లి కార్డులు పంచేందుకు వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం కొయ్యకొండ గ్రామానికి చెందిన షణ్ముఖ ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై వచ్చి పెళ్లి కార్డులు పంచి తిరుగు ప్రయాణంలో శుక్రవారం సాయంత్రం పాలకొండ వెళ్తుండగా రేగిడి మండలంలోని లచ్చారాయపురం సమీపంలో రాజా నుంచి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షణ్ముఖ మృతిచెందగా స్నేహితులిద్దరూ గాయాలపాలయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికుల సమాచారం మేరకు 108 వచ్చి క్షతగాత్రులతో పాటు మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించింది. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

బొబ్బిలిలో 2 కే రన్

బొబ్బిలి: ఎన్నికల సందర్భంగా స్వీప్ అధికారులు బొబ్బిలిలో శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. ఎన్నికలను బాధ్యతాయుతంగా స్వీకరించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు, పట్టణవాసులు యువత 2కే రన్‌లో పాల్గొన్నారు.

అందరి బంధువు



బంటు సాయి దంపతులను ఆశీర్వదిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- నాడు సాయం..నేడు దగ్గరుండి వివాహం
- క్యాన్సర్ బాధితురాలికి అండగా నిలిచిన డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: గతంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలిక వైద్యానికి సహకరించి..నేడు ఆమె ప్రేమ వివాహానికి మద్దతు పలికి మనఃపూర్వక ఆశీర్వచనాలు అందజేసిన ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, పలువురు ఐఏఎస్ అధికారులకు ఆ బాలిక కుటుంబీకులు శతకోటి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కథనం వివరాలిలా ఉన్నాయి. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం పాచిపెంట మండలంలోని మడవలస గ్రామంలో నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గిరిజన బాలిక బంటు సాయి కుటుంబసభ్యులు రాజన్నదొరను కలిసి మాట్లాడి తమ బిడ్డ క్యాన్సర్‌తో బాధపతోందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వారి పరిస్థితిని చూసి చలించిన రాజన్నదొర కొంత ఆర్థిక సాయం అందించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో సాక్షితో ఆమె కుటుంబీకులు మాట్లాడిన సమయంలో తనకు బతకాలని ఉందని, ఆనాటి పార్వతీపురం ఐటీడీఏ పీఓ లక్ష్మీశాను చూడాలని ఉందని క్యాన్సర్ బాధితురాలు సాయి చెప్పగా సాక్షి జిల్లా సంచికలో ఆ వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన లక్ష్మీశా అదేరోజు ఉదయం ఆ బాలిక ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని చలించిపోయారు. ప్రతినెలా బాలిక మందుల కోసం కుటుబసభ్యులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకుని, జీవితాంతం ఐటీడీఏ ద్వారా బాలికకు మందులు అందించేలా చర్యలు తీసుకున్నారు. తనకు చదువుకోవాలని ఉందని బాధితురాలు కోరగా రాజన్నదొర, లక్ష్మీశాలు పాచిపెంట మండలంలోని పి.కోనవలస గిరిజన గురుకుల బాలికల కళాశాలలో చదువుకునే ఏర్పాట్లు చేశారు. తరువాత కొన్ని కారణాల వల్ల ఆ బాలికకు మందులు అందక ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర వద్దకు వెళ్లి సాయి, ఆమె తల్లి చెప్పారు. తక్షణమే స్పందించిన రాజన్నదొర ఆమెకు ధైర్యం చెప్పి ఆర్థికసాయం అందిస్తూ మందులు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఏ కష్టమొచ్చినా తనకు చెప్పాలని తానున్నానని ధైర్యం చెప్పి ప్రతి నెలా కొంత ఆర్థిక సాయం అందించారు. ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో పార్వతీపురం మన్యం జేసీ, ఇన్‌చార్జ్ పీఓ ఆనంద్, ప్రస్తుత ఐటడీఏ పీఓ విష్ణుచరణ్ ప్రత్యేక చొరవ తీసుకుని సాయికి క్రమం తప్పకుండా మందులు అందేలా చర్యలు చేపట్టారు.

ప్రేమ గెలిచి..పెళ్లి పీటలెక్కిన వేళ..

గతంలో గ్రామానికి చెందిన బూతాల పోలారావు, సాయిలు ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించుకున్నారు. సాయి ఆరోగ్యం ఇప్పుడు మెరుగుపడిన నేపథ్యంలో, తమ ప్రేమ విషయాన్ని ఇరుకుటుంబాల తల్లిదండ్రులకు పోలారావు, సాయి తెలియజేశారు. ఈ క్రమంలో వైద్యుల సూచన, పెద్దల ఆమోదంతో పోలారావు, సాయిల పెళ్లి శుక్రవారం వేకువజామున మడవలస గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ పెళ్లికి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ముఖ్యఅతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మారుమూల మడవలస గ్రామంలో జరిగిన వివాహానికి ప్రత్యేకంగా రాజన్నదొర వచ్చి ఆశీర్వదించడం, ఆ కుటుంబానికి ఎప్పటికప్పుడు అండగా నిలుస్తుండడంతో స్థానిక ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగ కథలకు మూలమైన ప్రేమ గెలిచింది. ఇక ఆ బాలికకు దైవబలం తోడై సుఖసంతోషాలు కలగాలని అక్కడికి వచ్చిన పలువురు ప్రజలు ఆకాంక్షించారు.

ఇంటి తాళాలు విరగ్గొట్టి

- 12 తులాల బంగారం, 3.5కేజీల వెండి,రూ 53వేల నగదు చోరీ
- లబోదిబోమంటున్న బాధితుడు



ఇంట్లోని బీరువాలో, ఇతర వస్తువులను చిందరవదర చేసిన దొంగలు

కొత్తవలస: మండల కేంద్రంలో అత్యంత రద్దీ గల ప్రాంతంలో గురువారం రాత్రి భారీ దొంగతనం జరగడంతో కాలనీవాసులు భయాందోళనకు లోనయ్యారు. ఓ ఇంటి తాళాలు విరగ్గొట్టి చోరీకి పాల్పడిన దొంగలు బంగారం, వెండి, నగదు దోచుకుపోయారు. ఈ ఘటనపై బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ వెనక గల రాజీవ్‌నగర్ కాలనీలో పెదిరెడ్ల ప్రభాకర్ నివాసం ఉంటున్నారు. ఆయన భార్య పురిటికోసం పుట్టింటికి ఆరు నెలల క్రితం నర్సీపట్నం వెళ్లింది. అప్పటి నుంచి ప్రభాకర్ ఒక్కరే ఇంటిలో ఉంటున్నారు. అయితే గురువారం రాత్రి ఒంట్లో నలతగా ఉందని సమీపంలో గల స్నేహితుడి ఇంట్లో ప్రభాకర్ పడుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చే సరికి గేటు తాళాలు, తలుపుల తాళాలు విరగొట్టి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూసి పరిశీలించగా దొంగలు పడిన ఆనవాళ్లు గుర్తించి బీరువాలో పరిశీలించగా అందులో భద్రపరిచిన 12 తులాల బంగారు వస్తువులు, 3.5 కేజీల వెండి, రూ.53వేలు నగదు మాయమయ్యాయి. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.చంద్రశేఖర్, ఎస్సై సుదర్శన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విజయనగరం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ సభ్యులు వేలిముద్రలను సేకరించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీమ్